RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 100 | మార్చి 8, 2025 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ..
నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379



## సబలకు సలాం..

- ఆమె ఎప్పటికీ పరిపూర్ణమే..
- బహుముఖ పాత్రలు పోషిస్తూ.. తాను కరుగుతూ వెలుగునిస్తున్న దీపం
- సృష్టికి మూలమైన ఆమెకు శతకోటిసార్లు వందనాలు సమర్పించినా తక్కువే

**వేద న్యూస్, ఇవాంజలి:**

యుగయుగాల నుంచి అడుగడుగునా వివక్షను ఎదుర్కొంటూ ఇంటిలో నుంచి మొదలైన తన చైతన్యం నింగిలోకి ఎగిరే వరకు కొనసాగిస్తున్నా.. తనకింకా దక్కనేలేదు అసలైన గౌరవం, విలువ.. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం ఎన్నో ఏళ్ల నుంచి జరుపుతున్నప్పటికి నిజంగా మహిళలకు సామజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం ఉందా..? నిర్భయ నుంచి నేటి దిశ సంఘటనల వరకు ఆమె పట్ల ఉన్న అనుచితమైన వైఖరి గానీ అణచివేత గానీ ఏమైనా మారిందా..? కేవలం ఒక్కరోజు అభినందనలు తెలుపుతూ లోలోపల వారిపై చేస్తున్న కుట్రలను ఈ వ్యవస్థ ఖండిస్తుందా వారికి అండగా నిలిచిందా..?

మగవాళ్లు చేస్తున్న దారుణాలకు ఒడిగడుతున్న అత్యంత భయానకమైన చర్యలకు ఈ ప్రభుత్వాలు నిజంగా న్యాయం చేస్తున్నాయా..? సమస్య ఏదైనా గానీ అన్యాయం జరిగినప్పుడు న్యాయం కోసం న్యాయస్థానాలను ఆశ్రయిస్తే భాధిత మహిళలకు కొంతవరకైనా ఊరట లభిస్తుందా..? 77 ఏళ్ల స్వాతంత్ర దేశంలో ఇంకా మహిళలు బయటికి రావడానికి ధైర్యం చేయని రోజులు ఎందుకు దాపూరించాయి..? వీటన్నింటికి సమాధానం ఒక్కటే..ఎక్కడ స్త్రీ పూజింపబడుతుందో అక్కడ దేవతలు కొలువై ఉంటారు అనే మాట వాడుకలో ఉన్నప్పటికీ వాస్తవంలోకి చూస్తే తనపట్ల జరుగుతున్న హింసకు దారుణాలకు ఏ న్యాయస్థానాలు తీర్పు చెప్పగలవు. మహిళా దినోత్సవం అనగానే కేవలం ఆచారపరంగా జరుకోవడమే కాకుండా వారిని మగవాళ్లతో సమానంగా భావిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఈ వ్యవస్థకు ఉంది. మహిళా సాధికారత అని ప్రచారాలు చేస్తూ వారిని ఎదగనీయకుండా ఆంక్షలు విధిస్తూ మానసిక స్థైర్యాన్ని కోల్పోయేలా చేస్తున్న వ్యక్తుల వైఖరిని సరిచేసే సమాజం ఉన్నప్పుడే నిజమైన మహిళా దినోత్సవం జరుగుతుంది. ఎప్పుడైతే సమాజం వారిపట్ల అమానవీయత చూపిస్తుందో.. ఈ ప్రపంచానికి మనుగడ లేకుండా పోతుంది. సృష్టికి మూలం అమ్మే అని పొగిడే మనం ఆమె పట్ల ఎంతవరకు న్యాయంగా ఉన్నామనేది ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. అన్నిరంగాలలో అవమానాలు, అవహేళనలు సహిస్తూ ఉన్నతంగా నిలబడుతున్న వారికి భరోసానిద్దాం. స్త్రీని గౌరవించని వ్యవస్థ ఏదైనా కూలిపోతుందనే సత్యాన్ని గ్రహించి ఇంకా ఇంకా వారిని దోపిడీ చేయకుండా వారికి చేయూతనిచ్చి.. ఆదుకుంటారో ఇకనైనా మేలుకొని ముందుకు సాగుతారో మీరే తేల్చుకోండి.

## విధులు కాని విధులు..

# వేతన వేతలు!




- గ్రూప్-4 ఉద్యోగుల్లో హైరానా..!
- ఫీల్డ్‌కు వెళుతూ.. టార్గెట్ పూర్తి చేయడానికి అవస్థలు..
- భానుడి భగభగ తట్టుకోలేక.. డీలా పడుతూ డ్యూటీలు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ.. ఉద్యోగుల్లో ఆందోళన
- బల్దియా తీరుతో అరిగోసలు పడుతున్న ఎంప్లాయీస్!

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

సాధారణంగా గ్రూప్-4 ఉద్యోగులు ఉదయం 9 లేదా 10 నుంచి సాయంత్రం 4 లేదా 5 గంటల వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పరిపాలనకు సంబంధించిన విధులు(అడ్మినిస్ట్రేటివ్ జాబ్ రోల్) నిర్వర్తిస్తారని ఉద్యోగ వర్గాల ద్వారా తెలుస్తోంది. కాగా, వరంగల్ బల్దియాలో మాత్రం అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని స్పష్టమవుతోంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా అలాటయిన గ్రూప్-4 ఎంప్లాయీస్ 'తమవి కాని విధులు' నిర్వర్తిస్తూ.. వేతనం కోసం వెతలు పడుతున్నారు. సుమారు 2 నెలలుగా ఉద్యోగులు తమకు సంబంధం లేని డ్యూటీలను చేస్తున్నారు. కనీసం ఐడీ కార్డు వంటివి లేకున్నా.. ప్రస్తుత వేసవి కాలంలో సైతం భానుడి భగభగ తట్టుకోలేక.. ఉన్నతాధికారులు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయడానికి అష్టకష్టాలు పడుతున్నట్టుగా తెలుస్తోంది. ఎలాంటి అలవెన్సులు లేకున్నా తాము ఆ సర్వే జాబ్ చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఏండ్లుగా సర్కారీ కొలువు కోసం కష్టపడిన అభ్యర్థులు.. గ్రూప్-4 జాబ్ సాధించామని, ఇక హాయిగా ఆఫీసులో అడ్మినిస్ట్రేటివ్ వర్క్ చేస్తూ ముందుకు సాగాలని భావించారు. కానీ, వారి ఆశలు అడియాసలే అవుతున్నాయి. బల్దియా పోకడల వల్ల వారు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పని చేయాల్సి వస్తున్న

మిగతా 4వ పేజీలో..

## పేదల కోసం పనిచేసే ప్రభుత్వం మాది..

- వచ్చేవారం నుంచి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం
- గత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అరాచకం చేసింది
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**వేద న్యూస్, పాలేరు :**



వచ్చేవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. శుక్రవారం పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ పేదవారి ప్రభుత్వం కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుని ఈ రోజుతో 15 నెలలు అయ్యిందని గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థంగా తయారైందని అన్నారు. అయినా కూడా తెలంగాణ ప్రజానీకానికి ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ ముందుకెళుతున్నామన్నారు. అర్హులైన వారికి అందరికీ రేషన్ కార్డులు ఇస్తాం,రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగోలేని కారణంగా తులం బంగారం లేటవుతుందన్నారు. ఆనాటి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అరాచకం సృష్టించింది. వాటన్నింటినీ గాడిన పెడుతూ అభివృద్ధి, సంక్షేమం చేపడుతున్నాం. ఎక్కడ తగ్గకుండా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. పేదవారి కోసం ఇందిరమ్మ ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తోంది. ఇచ్చిన ప్రతి మాటను..హామీని ఆలస్యమైనా నిలబెట్టుకుంటామని మంత్రి పొంగులేటి తెలిపారు.




## వరంగల్ నూతన సీపీగా సన్ ప్రీత్ సింగ్

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్ గా సన్ ప్రీత్ సింగ్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారిచేసింది. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సన్ ప్రీత్ సింగ్ 2011ఐపిఎస్ బ్యాచ్‌కు చెందినవారు. 2012 సంవత్సరంలో ములుగు ఏఎస్పీ, వరంగల్ రూరల్ ఓఎస్డిగా పని చేశారు. అనంతరం ఎల్.బి నగర్ డిసిపీ గాను, ఎస్పీగా జగిత్యాలలో పనిచేశారు. కాగా వరంగల్ పోలీస్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న అంబర్ కిషోర్ ఝా రామగుండం పోలీస్ కమిషనర్ గా బదిలీ అయ్యారు.

## ప్రభుత్వ ఉద్యోగాల పేరిట లక్షల్లో స్వాహా..!

**వేద న్యూస్ , వరంగల్ క్రైమ్ :**

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ, అలాగే నిట్ లాంటి కళాశాలలో సీటు ఇప్పిస్తున్నాను అంటూ బాధితుల నుండి లక్షల్లో డబ్బుతో పాటు బంగారు అభరణాలను స్వాహా చేసిన మోసగాడిని హన్మకొండ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసారు. నిందితుడి నుండి పోలీసులు సుమారు ఐదు లక్షల పదివేల రూపాయల విలువ గల గ్రాముల బంగారు అభరణాలతో పాటు 2లక్షల 68 వేల రూపాయల నగదుతో పాటు మూడు సెల్‌ఫోన్లను, ఐడిఎఫ్సి డెబిట్ కార్డు ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి హన్మకొండ ఏసిపి దేవేందర్ రెడ్డి వివరాలను వెల్లడిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కడప జిల్లా, వీరపునాయునిపల్లి మండలం, ఇందుకూరు కొత్తపల్లి గ్రామానికి చెందిన నిందితుడు కొమ్మ వివేకానంద రెడ్డి ఆలియాస్ కిషోర్ రెడ్డి (37) కొద్ది కాలం ప్రవైయిట్ టీచర్‌గా పనిచేస్తూ వచ్చిన జీతం డబ్బు తన జల్సాలకు ఖర్చు కావడంతో తన తోటి ఉపాధ్యాయులతో స్నేహంగా మంచివాడిగా నటిస్తూనే వారి వద్ద త్వరలోనే తిరిగి ఇస్తానని డబ్బులు, బంగారు నగలను తీసుకోని వారికి తిరిగి ఇవ్వకుండా సహోద్యోగులను మోసం చేసిన సంఘటనలో నిందితుడుపై అంధ్రప్రదేశ్‌లో మూడు కేసులు నమోదు కావడంతో నిందితుడు రెండు నెలలు జైలు జీవితం గడిపిన అనంతరం నిందితుడు తన మకాంను హన్మకొండకు మార్చుకున్నాడు. ఇక్కడ నిందితుడు కొత్త పేరుతో ఓ ప్రవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూనే మంచివాడిగా గుర్తింపు తెచ్చుకున్నాక కొద్ది రోజుల అనంతరం నిందితుడు అందులో పనిచేసే మరో మహిళా ఉపాధ్యాయురాలి పరిచయం చేసుకొన్నాడు. తనకు వరంగల్ ఎన్.ఐ.టిలో పరిచయస్తులు వున్నారని ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని సదరు మహిళా ఉపాధ్యాయురాలిని నమ్మించి ఆమెవద్ద ఎనిమిది లక్షల రూపాయలతో పాటు ఆమె కొడుకు ఎన్.ఐ.టిలో సీటు ఇప్పిస్తానని 60గ్రాముల బంగారు అభరణాలు తీసుకుని అక్కడి మకాం మార్చాడు. ఇదే రీతిలో నిందితుడు పేరు మార్చుకొని మరో ముగ్గురు బాధితుల నుండి ఇదే తరహాలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసానికి పాల్పడినట్లు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేసారు. నిందితుడు మోసం చేసి దోచుకున్న సోమ్ముతో జల్సాలు చేయడంతో పాటు, ఇంటి గృహోపరకరణాలు, బంగారు అభరణాలు చేయించుకున్నాడు. శుక్రవారం తాను నివాసం వుంటున్న కిరాయి ఇంటినుండి సామాను తరలిస్తుండుగా పోలీసులు నిందితుడి పట్టుకోని అదుపులోకి తీసుకోని విచారించగా నిందితుడు పాల్పడిన నేరాన్ని అంగీకరించాడు. నిందితులను పట్టుకొవడంలో ప్రతిభ కనబరిచిన హన్మకొండ పోలీస్, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని ఏసిపి అభినందించారు. అదే విదంగా ప్రైవేట్ పాఠశాల యాజమానులను ఉద్దేశించి కొత్తగా జాయిన్ అయ్యే టీచర్ల యొక్క పూర్తి వివరాలు మరియు వారు ఎక్కడ పని చేసి వచ్చారో, వారి పై ఏమైనా కేసులు ఉన్నాయో విచారించిన తర్వాతనే స్కూల్ లో జాయిన్ చేసుకోగలరని ఏసీపీ దేవేందర్ రెడ్డి సూచించారు.






## జూట్ ఉత్పత్తులపై అవగాహన అవసరం

- కలెక్టర్ డా.సత్యశారద

**వేద న్యూస్, వరంగల్ :**

జూట్ ఉత్పత్తులపై అవగాహన అవసరమని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్యశారద అన్నారు. శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో గల ఎం.కె. నాయుడు హొటల్ లోని అపూర్వ హాల్ లో భారత ప్రభుత్వ టెక్స్ టైల్ మంత్రిత్వశాఖ సహకారంతో జాతీయ జనపనార బోర్డు ఆధ్వర్యంలో జూట్ మార్క్ ఇండియా పథకం పై స్వయం సహాయక గ్రూపు (ఎస్ హెచ్ జీ) మహిళలకు, జ్యూట్ ఉత్పత్తిదారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. భారత టెక్స్ టైల్ మంత్రిత్వశాఖ టెక్స్టైల్ కమిటి హైదరాబాద్ ఇంచార్జి అధికారి కె.శిరీష అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ హితమైన జనపనార ఉత్పత్తులు ప్రజల దినచర్యల్లో భాగం కావాలని అప్పుడే జనపనార ఉత్పత్తులకు డిమాండ్ తో పాటు పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని అన్నారు. జనపనారతో ప్రజలకు నిత్య జీవితంలో ఉపయోగపడే పలు

# వరంగల్ కాంగ్రెస్ లో కుమ్ములాటలు

వరంగల్ : రాజకీయాల్లో ప్రత్యర్థి పార్టీల మధ్య సవాళ్లు, వార్నింగులు సహజమే.. అయితే అక్కడ పరిస్థితి డిఫరెంట్‌గా కనిపిస్తోంది. తలతిక్క వేషాలు వేస్తే ఊరుకునేది లేదు. నా అనుచరులను డిస్టర్బ్ చేస్తే సహించేది లేదు.. ఇది ఓ ఎమ్మెల్యే తన సొంత పార్టీ నేతకు బహిరంగంగా ఇచ్చిన వార్నింగ్. ఈ వార్నింగ్ తో ఆ నియోజకవర్గ రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. దీంతో పార్టీలో ఏం జరుగుతోందో అంటూ చర్చలు మొదలయ్యాయి. ఇంతకీ ఈ మాస్ వార్నింగ్ ఇచ్చిందెవరు..? ఆయనకు ఎందుకని అంత కోపం వచ్చింది?ఓరుగల్లు రాజకీయాలలో ప్రత్యర్థి పార్టీల నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు, వివాదాలు సహజం. కానీ ఓ ఎమ్మెల్యే మాత్రం తన సొంత పార్టీ నాయకునికి బహిరంగంగా వార్నింగ్ ఇచ్చి పొలిటికల్ సర్కిల్స్ లో హీట్ పెంచారు. పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే సహించేది లేదని బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. కీలక సంస్థల ప్రధాన కార్యాలయాలు , వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన అడ్మినిస్ట్రేటివ్ భవనాలు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోనే ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరంగల్ పశ్చిమ స్థానం నుండి పోటీ చేసేందుకు ఆశావహులు భారీ స్థాయిలో పోటీపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నుండి సుమారు 15 మంది నాయకులు టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. హనుమకొండ డీసీసీ ప్రెసిడెంట్ నాయిని రాజేందర్ రెడ్డి, జంగా రాఘవరెడ్డిల మధ్య టికెట్ పోరు రసవత్తరంగా సాగింది. వరంగల్ పశ్చిమలో తనకు టికెట్ ఇవ్వకుంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని బహిరంగంగానే జంగా రాఘవరెడ్డి తన అసంతృప్తి వెళ్ళగక్కారు.అయితే చివరకు అధిష్టానం జంగా రాఘవరెడ్డిని కాదని నాయిని రాజేందర్ రెడ్డికి టికెట్ ఇచ్చింది. డీసీసీ పదవి విషయంలోనూ గతంనుండే జంగా రాఘవరెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి ల మధ్య వర్గ పోరు నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలలో నాయిని రాజేందర్ రెడ్డి ఘన విజయం సాధించడంతో జంగా రాఘవరెడ్డి సైలెంట్ అయ్యారు. పార్టీకి డామేజ్ జరగద్దని భావించిన అధిష్టానం జంగా రాఘవ రెడ్డికి పామ్ ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ నామినేటెడ్ పదవి కట్టబెట్టింది.ఇన్నాళ్లు సైలెంట్ గా ఉన్న జంగా రాఘవరెడ్డి అనుచరులు గత కొద్ది రోజుల నుండి సోషల్ మీడియా వేదికగా పార్టీకి నష్టం కలిగేలా ప్రచారం సాగిస్తున్నారట. అంతేకాకుండా స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారట. గత పది ఏళ్ల కాలంలో పార్టీ అధికారంలో లేకున్నా అందరినీ కంటికి రెప్పలా కాపాడుకున్నాడని తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి పార్టీకి సేవ చేశారని మెసేజ్‌లు ఫార్వర్డ్ చేస్తున్నారట. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కారణంగా జంగాకు టికెట్ ఇవ్వలేదని మరోసారి అవకాశం ఇస్తామని హైకమాండ్ బుజ్జగించిందని..అందుకే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలంటూ కాంగ్రెస్ సేవల గ్రూపులో ప్రచారం చేస్తున్నారట.ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ టికెట్ కోసం ప్రచారం చేయడమే కాకుండా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ కాంగ్రెస్ కేడర్ను రెండు వర్గాలుగా చీల్చే ప్రయత్నాలు చేస్తున్నారని నాయని అనుచరు? చెప్పుకుంటున్నారు. జంగాకి ఎమ్మెల్సీ పదవి వస్తే మళ్లీ కాంగ్రెస్ క్యాడర్ రెండుగా చీలిపోతుంది అని ఇద్దరి మధ్య ఆధిపత్య పోరులో పార్టీ మనుగడకే మోసం వస్తుందని సీనియర్ కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.గత ఎన్నికలకు ముందు సైతం జంగా రాఘవరెడ్డి టిఆర్ఎస్ నేతలకు అమ్ముడుపోయారని కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి ప్రయత్నించారని నాయని రాజేందర్ రెడ్డి వర్గం ఆరోపిస్తోంది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో సైతం సొంత పార్టీ అభ్యర్థి అయిన నాయిని రాజేందర్ రెడ్డి ఓటమి కోసం టిఆర్ఎస్ అభ్యర్థితో చేతులు కలిపాడని ఆరోపిస్తున్నారు. అలాంటి వ్యక్తికి ఎమ్మెల్సీ పదవి కట్టబెడితే పార్టీని సర్వనాశనం చేస్తాడని జంగా రాఘవరెడ్డి పై తీవ్ర స్థాయిలో ఫైర్ అవుతున్నారు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి. కాజీపేట పరిధిలోని కొంతమంది నాయకులు జంగా రాఘవరెడ్డి అనుకూలంగా ప్రచారం చేస్తుండడంతో విషయం తెలుసుకున్న నాయని తీవ్రంగా ఫైర్ అయ్యారు. టిఆర్ఎస్ తో చేతులు కలిపి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారని కాంగ్రెస్ కేడర్ను అయోమయానికి గురి చేస్తున్నారని జంగా రాఘవరెడ్డిని తీవ్రస్థాయిలో టార్గెట్ చేశారు. అంతేకాకుండా తనకు ప్రజల్లో మంచి పేరు వస్తుందని బీఆర్ఎస్ నేతలతో కుమ్మక్కై తన వెనుక గోతులు తీస్తున్నారని దుయ్యబట్టారు. ల్యాండ్ కబ్జాలు, సెటిల్మెంట్లు లేకుండా ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో తిరిగి దందాలు మొదలు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అభివృద్ధి పనులకు అడ్డుపడుతున్నారని.. ఇలా చేస్తే సహించేది లేదని జంగా రాఘవరెడ్డి అనుచరులకు బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చారు.మొత్తమ్మీద ఇన్నాళ్లు సైలెంట్ గా ఉన్న జంగా రాఘవరెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి మధ్యలోని వర్గపోరు, ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బహిరంగంగా జంగా రాఘవరెడ్డి, అతని అనుచరులకు వార్నింగ్ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీలో ఏం జరగబోతుందోననే ఉత్కంఠ మొదలైంది. స్థానిక సంస్థలు సమీపిస్తున్న వేళ ఇద్దరి మధ్య వర్గ పోరు ఎక్కడికి దారితీస్తుందోననే చర్చ నడుస్తోంది.

# ఐటీడీఏల్లో అక్రమ డిప్యుటేషన్లు


హైదరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేడెట్ ట్రైబల్ డెవల్‌పమెంట్ ఏజెన్సీ(ఐటీడీఏ)ల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జిల్లా వైద్యాధికారులు అక్రమ డిప్యుటేషన్లు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యేకించి ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని ఐటీడీఏల పరి?ధిలో ఇలాంటివి ఎక్కువగా జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతేడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం అన్ని రకాల డిప్యుటేషన్లు, వర్క్ ఆర్డర్లను రద్దు చేసింది. ఎవరికైనా డిప్యుటేషన్ ఇవ్వాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అ ని పేర్కొంది. అలాగే జిల్లాల్లో అత్యవసర పరిస్థితుల్లో డిప్యుటేషన్ ఇవ్వాలంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరి. అయితే ఐటీడీఏ ప్రాంతాల్లో మాత్రం ఐఏఎస్ అధికారి అయిన ప్రాజెక్టు ఆఫీసర్(పీవో), అడిషనల్ డీఎంహెచ్‌వో(ట్రైబల్) అనుమతులు తీసుకోవాలి. కానీ వీరి అనుమతి లేకుండా గిరిజన ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు, వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌వోలు ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్లపై పంపుతున్నట్లు ఆరోపణలున్నాయి. కలెక్టర్లు, ప్రాజెక్టు అధికారులతో పాటు ప్రజారోగ్య సంచాకులు పట్టించుకోకపోవడంతో అక్రమ డిపుటేషన్లను య?థేచ్ఛగా ఇచ్చేస్తున్నారు. వైద్య సిబ్బంది స్థాయిని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రూ.30 వేల నుంచి మొదలుకొని రూ.లక్ష వరకు వసూళ్ల పర్వం నడుస్తున్నట్లు ఐటీడీఏ పరి?ధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది చెబుతున్నారు. తెలంగాణలో భద్రాచలం, ఏటూరు నాగారం, ఉట్నూరు, మన్ననూరులో ఐటీడీఏలు ఉన్నాయి. ఒక్కో ఐటీడీఏ పరిధిలో సగటున 25 నుంచి 30 వరకు పీహెచ్‌సీలున్నాయి. పీహెచ్‌సీల్లో వైద్యులు, స్టాఫ్‌నర్స్‌లు, ఫార్మసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, ఏఎన్‌ఎమ్‌లు, ఆఫీసు సబార్డినేట్లతో పాటు అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది ఉంటారు. డాక్టర్లు మొదలుకొని ఆఫీసు సబార్డినేట్ల వరకు నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు, వర్క్ ఆర్డర్లు ఇస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. కేవలం మౌఖిక ఆదేశాలతో కూడా కొందరికి ఇటువంటి వర్క్ ఆర్డర్లు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

అంతా ఇష్టారాజ్యం...

భద్రాచలం ఐటీడీఏ పరిధిలో 27 వరకు పీహెచ్‌సీలున్నాయి. ఇక్కడ కూడా నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. మారుమూల ప్రాంతాల్లోని వైద్యులను వర్క్ ఆర్డర్ పేరుతో జిల్లా వైద్యాధికారి కార్యాలయానికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. జూలూరుపాడు పీహెచ్‌సీలో పనిచేసే ఓ మెడికల్ ఆఫీసర్, నర్సాపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, సులానగర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌ను డీఎంహెచ్‌వో కార్యాలయానికి డిప్యుటేషన్స్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే జిల్లా ఆస్పత్రిలో పనిచేసే ఓ స్టాఫ్‌నర్స్‌ను కూడా డీఎంహెచ్‌వో ఆఫీసుకు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో స్టాఫ్‌నర్స్‌కు ఏం పని ఉంటుందని అక్కడి వైద్య సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ఇక ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో 32 పీహెచ్‌సీలున్నాయి. ఆ ఐటీడీఏ పరిధిలో గిరిజన ప్రాంత పీహెచ్‌సీల్లోని ఏడుగురు డాక్టర్లను మైదాన ప్రాంతాలకు డిప్యుటేషన్‌పై పంపినట్లు తెలుస్తోంది. బజార్‌హత్నూర్ వైద్య అధికారిని తాంసీ పీహెచ్‌సీకి, జరి నుంచి శాంతినగర్‌కు, సైదాపూర్ నుంచి పుల్లీబౌలికి, భీమాపూర్ నుంచి ఇంద్రవెల్లికి, నర్సాపూర్ నుంచి అంకోలికి, గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్ టీబీ సెంటర్‌కు వైద్య అధికారులను డిప్యుటేషన్లపై పంపినట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. ఈ పీహెచ్‌సీలన్నీ గిరిజన ప్రాంతాల్లోనివే. అక్కడ పని చేయాల్సిన వైద్యులను గిరిజనేతర ప్రాంతాలకు పంపారు. రికార్డుల్లో వారంతా గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్నట్లు చూపుతూ.. అక్కడి వేతనాలు, అదనపు భత్యాలను అందిసున్నారు. గిరిజన ప్రాంతాల్లో పని చేసే వైద్యులు అడిషనల్ హెచ్‌ఆర్‌ఏ, ఏజెన్సీ భత్యాలను క్లెయిమ్ చేసుకోవచ్చు. అలాగే ఆ ప్రాంతాల్లో రెండేళ్లపాటు పని చేస్తే పీజీ ఇన్ సర్వీస్ కోటాకు అర్హులవుతారు. ఇక ఆ ఐటీడీఏ పరి?ధిలో 9 మంది ల్యాబ్ టెక్నీషియన్లను కూడా డిప్యుటేషన్‌పై పంపారు. అందులో ఒక్కరికే కలెక్టర్ నుంచి అనుమతి ఉంది. 9 మందిలో నలుగురు గిరిజన ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో పనిచేసేవారే. అందులో గుడిహత్నూర్, గాదిగూడ పీహెచ్‌సీలు 24 గంటలు పనిచేస్తాయి. అక్కడ పనిచేయాల్సిన వారిని డిప్యుటేషన్లపై పంపి.. వారి స్థానాలను ఖాళీగా ఉంచారు. అలాగే స్టాఫ్ నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆఫీస్ సబార్డినేట్లకు కూడా డిప్యుటేషన్లు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ తతంగం వెనుక డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఏటూరునాగారం ఐటీడీఏ పరి?ధిలో కూడా కొన్ని డిప్యుటేషన్లు నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇటువంటి డిప్యుటేషన్ల వల్ల గిరిజన ప్రాంత పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది లేక ఆరోగ్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

# మీనాక్షి మార్క్.. సమీక్షలు షురూ...

హైదరాబాద్ : ఏఐసీసీ కొత్త ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పనితీరుపై సమీక్షలు నిర్వహించనున్నారు. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో పార్టీ పనితీరును తెలుసుకునేందుకు గాంధీభవన్‌లో 4వ తేదీ నుంచి సమీక్షలు నిర్వహించారు. తొలుత మంగళవారం మెదక్, మల్కాజిగిరి పూర్తి చేయగా రెండో రోజు బుధవారం కరీంనగర్, ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల నేతలందరితో సమీక్షించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగే సమీక్షలకు.. ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీలు, ఇతర ముఖ్యనేతలందరూ రావాలని ఇప్పటికే ఆహ్వానాలు వెళ్లాయి. మీనాక్షి నటరాజన్ ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమితులైన తరవాత.. నిర్వహించబోతున్న తొలి సమీక్ష సమావేశాలు కావడంతో వీటికి ప్రాధాన్యం ఏర్పడింది. అటు గాంధీభవన్‌కు చాలామంది నేతలు క్యూకడుతున్నారు. ఎమ్మెల్యేలు ఎన్నుకునే ఎమ్మెల్సీ ఎన్నికలకు నలుగురు అభ్యర్థులను ఈ నెల 10లోగా పార్టీ ప్రకటించాల్సి ఉంది. వీటికి సంబంధించి పెద్దసంఖ్యలో నేతలు టికెట్లు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఇన్‌చార్జిని ప్రసన్నం చేసుకునేందుకు, తమ పనితీరును వివరించేందుకు నేతలు గాంధీభవన్ చుట్టూ తిరుగుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఇటీవల ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపింది. ఆ మేరకు కాంగ్రెస్‌లో పదవుల భర్తీ ఉంటుందని నేతలు చెబుతున్నారు. ప్రధానంగా మాల, మాదిగ వర్గాల నేతలకు ఎమ్మెల్సీ టికెట్లు, నామినేటెడ్, మంత్రి పదవుల భర్తీలో ఎస్సీ వర్గీకరణ ప్రకారం ప్రాధాన్యమిస్తారని ప్రచారం జరుగుతోంది. అటు తమకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని రెండు సామాజిక వర్గాల నేతలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.మాల, మాదిగలకు సంబంధించి.. ఒక వర్గానికి అవకాశమిస్తే మరో వర్గానికి ప్రభుత్వ సలహాదారు లేదా రాబోయే మంత్రివర్గ విస్తరణలో సర్దుబాటు చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఇక బీసీలకు ఎమ్మెల్సీ టికెట్లలో రెండు ఇవ్వాలని ఈ వర్గాల నేతలు పట్టుబడుతున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక పూర్తయితే ఏయే వర్గాలకు అవకాశం ఇస్తారనేది తేలుతుంది.ఇటు మిగిలిన సామాజిక వర్గాలకు నామినేటెడ్, మంత్రివర్గ విస్తరణ, పీసీసీ రాష్ట్ర కార్యవర్గ పదవులు ఇస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. పీసీసీ రాష్ట్ర కార్యవర్గ కూర్పు కూడా ఈ నెల 20లోగా పూర్తవుతుందని నేతలు అంచనా వేసునారు. పార్టీ పరిసితులు, సమస్యలు,



పరిష్కార మార్గాలపై ఆయా నేతలపై మీనాక్షి నటరాజన్ చర్చించనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటి నుంచే ఆమె ఫోకస్ చేశారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమావేశాలు నిర్వహించనున్నారు. దీని తర్వాత జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కార్యకర్తలతో భేటీ కావాలని భావిస్తున్నట్లు గాంధీ వర్గాలు చెబుతున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామ స్థాయిలో జరగడంతో వాటిపై తొలుత దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం అయితే ఓటు బ్యాంక్ చెదిరిపోకుండా ఉంటుందనేది హైకమాండ్ ఆదేశాలు. ఆ విధంగా ఆమె అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమితులైన తర్వాత మీనాక్షి నిర్వహిస్తున్న ఫస్ట్ సమీక్ష సమావేశాలు ఇవే. నేతలు సైతం వీటికే ప్రాధాన్యం ఇస్తున్నారు. మరో ఐదు ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. పెద్ద సంఖ్యలో నేతలు టికెట్లు ఆశిస్తున్నారు. కొత్త ఇన్‌ఛార్జిని ప్రసన్నం చేసుకునేందుకు నేతలు సైతం సిద్ధమవుతున్నవారు. దీని తర్వాత సామాజిక వర్గాలకు నామినేటెడ్, మంత్రివర్గ విస్తరణ, పీసీసీ రాష్ట్ర కార్యవర్గ పదవులు ఇస్తారనే వార్తలు లేకపోలేదు. పీసీసీ కార్యవర్గ కూర్పు ఈ నెల 20లోగా పూర్తి అవుతుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నామినేటెడ్ పదవుల్లో పెండింగ్ లో ఉన్నవాటిని భర్తీ చేయడానికి జిల్లాలవారీగా ఈనెల 10లోగా అర్హులను గుర్తించాలని ఇప్పటికే ఆదేశాలు వెళ్లాయి. దీనిపై ఇన్‌ఛార్జి మంత్రులు ఆయా వివరాలు సేకరిస్తున్నారు. మొత్తానికి పార్టీ బలోపేతంపై చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు మీనాక్షి నటరాజన్.నామినేటెడ్ పదవుల్లో మిగిలిన వాటిని భర్తీ చేయడానికి జిల్లాల వారీగా ఈ నెల 10లోగా అర్హులను గుర్తించాలని.. ఇన్‌ఛార్జి మంత్రులకు పీసీసీ ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. వారు ఆ వివరాలు సేకరిసునారు.

# ఓపెన్ గార్బేజీల వద్ద వాయిస్ అసిస్టెన్స్ కెమెరా

హైదరాబాద్ : నాగార్జున హీరోగా ఆ మధ్య వచ్చిన సూపర్ సినిమాలో బ్రహ్మానందం దగ్గర అబద్ధాలు కనిపెట్టే మిషన్ ఉంటుంది. అలీని ఓ కేసులో బ్రహ్మానందం ప్రశ్నలు అడుగుతుంటాడు. ఆ సమయంలో అలీ అబద్ధం చెప్పిన ప్రతిసారి మిషన్ అరుస్తుంది. ఇలాగే, మనం రోడ్లపై చెత్త వేసిన ప్రతిసారి మిషన్ అరిస్తే ఎలా ఉంటుంది?రోడ్లపై చెత్త వేయొద్దని జీహెచ్‌ఎంసీ ఎంతగా చెబుతున్నా చాలా మంది వినిపించుకోరు. బస్సుల్లో నుంచి వెళ్తూ కొందరు కిటికీల్లోనుంచే పేపర్లు పడేస్తారు. రోడ్డుపక్కన దుకాణంలో కొనుక్కుని తిని రోడ్డుపైనే అందుకు సంబంధించిన చెత్తను పడేస్తుంటారు. బైకుపై వెళ్తూ రోడ్డుపైనే చెత్తను పడేస్తూ వెళ్తుంటారు కొందరు. ఇంట్లోని చెత్తను మోసుకొచ్చి ఎక్కడపడితే అక్కడ పడేస్తుంటారు.ఇటువంటి వారందరినీ పసిగట్టి ఓ మిషన్ అరిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన జీహెచ్‌ఎంసీ అధికారులకు కూడా వచ్చింది. అంతేకాదు, రోడ్డు మీద చెత్త వేస్తే కిస్సిక్ మంటూ ఫొటో కూడా తీస్తుంది ఈ మిషన్. దీన్ని హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేశారు. అక్కడి ఓపెన్ గార్బేజీల వద్ద వాయిస్ అసిస్టెన్స్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇది విజయవంతమైతే మరిన్ని ప్రాంతాల్లోనూ ఈ వాయిస్ అసిస్టెన్స్‌ను ఏర్పాట్లు చేయనున్నారు.బంజారా హిల్స్‌లో ఓపెన్ గార్బేజీల వద్ద ఏర్పాటు చేసిన వాయిస్ అసిస్టెన్స్ కెమెరా ఎవరైనా చెత్త వేసేందుకు వస్తే ఫొటో తీస్తోంది. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీనగర్ లో ఓపెన్ గార్బేజీ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన వాయిస్ అసిస్టెన్స్ కెమెరా సెన్సార్.. ఎవరైనా చెత్త వేస్తే వారిని గుర్తిస్తోంది. అనంతరం వాయిస్ కంట్రోల్‌కు అది సందేశం పంపుతుంది.ఆ వెంటనే అక్కడ చెత్త వేయకూడదని తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మైకు అరుస్తుంది. ఈ ప్రయోగం ద్వారా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసేవారి సంఖ్య తగ్గుతుందని అధికారులు అంటున్నారు. ఇక్కడ చేస్తున్న ఈ ప్రయోగం విజయవంతమైతే జూబ్లీహిల్స్ సర్కిల్ 18లో కూడా వీటిని ఏర్పాటు చేయనున్నారు.ప్రస్తుతం పలు ప్రాంతాల్లో వాయిస్ అసిస్టెన్స్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఎవరైనా రోడ్లపై చెత్త వేస్తే వెంటనే స్థానిక ఎస్ఎఫ్ఏ, చెత్తను సేకరించే ఆటో రిక్షా కార్మికుడికి కూడా సందేశంతో పాటు వీడియో, ఫొటో వెళ్తాయని అంటున్నారు. చెత్త వేస్తున్న వారిని దీని ద్వారా గుర్తించి ఇటువంటి పనులు చేయకూడదని చెబుతారని అన్నారు.మరోవైపు, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) డంపర్‌బిన్లలో చెత్త దాదాపు 75 శాతం నిండగానే అలర్ట్ చేసేలా ఆధునిక డంపర్‌బిన్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే విధించే పెనాల్టీలకు ఇకపై ఈ చలాన్‌లను జారీ చేయనుంది. అలాగే, యూపీఐ చెల్లింపుల ద్వారానే ఆ జరిమానాలకు స్వీకరించనుంది.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం కరపత్రం విడుదల

నిర్మల్ : మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఖానాపూర్ మండలంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకులు భాను బేగం అదిలాబాద్ జిల్లా నాయకురాలు రమ్య కళ ఆధ్వర్యంలో 115 వ కరపత్రంను ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ . సుదాకార్ ,కార్యదర్శి కర్నాటి మల్లేష్ లు ముఖ్య అతిధులుగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుదాకార్ మాట్లాడుతూ శ్రామిక మహిళల పోరాటానికి చిహ్నం. అంతర్జాతీయ మహిళా దినోత్సవ మన్నారు.వందల ఏళ్ల కిందటే పని గంటలను తగ్గించాలని తాము అనుభవిస్తున్న దుర్భర పరిస్థితులను తామే మార్చుకోవడం కోసం మహిళలు వీధుల్లోకి వచ్చి కదం తొక్కిన రోజుకు గుర్తుగా మహిళా దినత్సోవం రూపొందించిందన్నారు. ఆ పోరాటాల స్ఫూర్తిని మరోసారి గుర్తు చేసుకుంటూ దేదీప్యమానమైన భవిష్యత్తు కోసం మహిళా సమాజం అడుగులు వేయడం కోసం సూర్తినికి పొందే రోజుగా దీన్ని నిర్వహించుకోవాల్సి ఉంటుంది. అయితే నేడు దురదృష్టవశాత్తు మహిళా దినోత్సవం అందించిన స్ఫూర్తి క్రమంగా కనుమరుగవుతున్నది. ఏ లక్ష్యం కోసం పోరు జరిగిందో, దేని కోసం పోరాటం జరగాలో అనే అంశాల కనీస ప్రస్తావన లేకుండా మహిళా దినోత్సవాల నిర్వహణ ఒక తంతుగా మారుతున్న పరిస్థితులు మార్చేసి మహిళలకు అందవలసిన స్ఫూర్తిని, వారికి చూపించాల్సిన నవయుగాన్ని కనుమరుగు చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సోషలిస్టు సమాజం వ్యవస్థాపకుడు కామ్రేడ్ లెనిన్ మహశయుడు మహిళల సాధికారత గురించి చేసిన వ్యాఖ్యలను ఒక సారి గుర్తు చేసుకోవలసి ఉన్నది. మహిళా సమాజంలో నూతన వెలుగులు నిండాలంటే స్త్రీలను వంటిల్లు అనే జీవరహిత వాతావరణం నుంచి బయటకు తెచ్చి సామాజిక కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడం, రాజకీయాల్లోకి తీసుకుని రావడం చాలా ముఖ్యమన్న ఆలోచనలు విప్లవాత్మకమైనవి. "వంట గదికి పరిమితంగా చూడబడుతున్న మహిళలను అక్కడి నుంచి విముక్తం చేయకపోతే వారికి నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, సమానత్వాలు సాధ్యం కావనేది లెనిన్ ప్రతిపాదన. ప్రతి వంటకత్తె ఒక రాజకీయ వేత్త కావాలి అనే లోతైన అంశాలతో లెనిన్ అనేక ప్రసంగాలు, వ్యాసాలు కూడా రాశారు. ఇక్కడ మహిళలు రాజకీయ వేత్త కావాలి అంటే కేవలం పదవులు పొందడం కాదు, పదవుల కోసం ఉద్యమాలు నిర్వహించడమూ కాదు. 'సరైన రాజకీయ, ఆర్థిక, తాత్విక తుర్పుధాలును అలువల్చు కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఖానాపూర్ మండల అధ్యక్షులు పసుపుల మీన అమ్ముల కవిత ,ఎర్రన్న శిరీష ,పసుపుల మీనా,అరుణ ,అందుర్తి నర్సు తదితరులు పాల్గొన్నారు.

# ముస్సిపల్ ఈ ఈ పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోండి

## - బెజ్జంకి అనిల్ మాదిగ ఎం.ఆర్.పి.ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు



కరీంనగర్ : ఫిబ్రవరి 19న కరీంనగర్ మున్సిపాల్ కార్యాలయం లో విధులు నిర్వహిస్తున్న ఈ ఈ రొడ్డ యాదగిరిపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎం.ఆర్. పి ఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది ఎం ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు బెజ్జంకి అనిల్ మాదిగ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లలో మాదిగ ఉద్యోగులపై కక్ష సాధింపులు జరుగుతున్నవి అనడానికి పిబ్రవరి 19న ప్రభుత్వ విధులలో వున్నా ఈ ఈ రొడ్డ యాదగిరి పై చేయి చేసుకున్న వారిపై ఇప్పటివరకు కూడా ఎలాంటి చట్టపరమైనా చర్యలు తీసుకోలేదు అంటే కేవలం అది కులావివక్ష అనేది మాకు స్పష్టంగా అర్థమవుతుంది. గతంలో ఒక దళిత మాజీ కార్పొరేటర్ మున్సిపాల్ ఉద్యోగి పై దురుషగా ప్రవర్తించాడని అతన్ని అరస్ట్ చేయాలనీ ఉద్యోగస్తులు అందరూ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేసారు కానీ యాదగిరి ఒక మాదిగ సామజిక వర్గానికి చెందిన వారు గనుకే మున్సిపల్ ఉద్యోగస్థులు మౌనం గా ఉండటం అంటే అది కులావివక్షగానే కనబడుతుంది అన్నారు. ఇది కరీంనగర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మా దళిత ఉద్యోగ్యాస్తుల పరిస్థితి ఇలాగే వుంది అని మాకు స్పష్టంగా అర్థమవుతుంది మాదిగ ఉద్యోగస్తులకు అన్యాయం జరిగితే ఒకలాగా ఇతరులకు జరిగితే ఒకలాగా వ్యవహారిస్తున్నారు అనేది మాకు స్పష్టంగా కనబడుతుంది.

అందుకోసం మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన ధర్నాలు చేస్తామన్నారు మున్సిపాల్ ఇంచార్జి గా వున్నా కలెక్టర్ ప్రత్యేక చోరువా తీసుకోని ఈ ఈ యాదగిరి న్యాయంచేసి వారిపై చట్టపరమైన చెర్యలు తీసుకోవాలి అన్నారు ఈ కార్యక్రమంలో బెజ్జంకి అనిల్ మాదిగ ఎం ఆర్ పి ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దండు అంజయ్య మాదిగ చెంచాల నవీన్ మాదిగ ఎం ఎస్ పి జిల్లా అధికార ప్రతినిధి నలిగంటి మల్లేశ్వరి మాదిగ దండు వరలక్ష్మి మాదిగ కొమ్ముల రాజమల్లు మాదిగ సోదిమేళ్ల వాణి మాదిగ ఓదెల శంకర్ మాదిగ బుద్దుల రమేష్ మాస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి క్వింటా 25 వేల చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

### వరికపూడిశెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలి

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ధర్నా - పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబుకు వినతిపత్రం

నరసరావుపేట : మిర్చి క్వింటాకు 25 వేల రూపాయలు చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, మరియు పలనాడు జిల్లా ప్రజల వరప్రసాదాయని అయినటువంటి వరికపుడిశెల ప్రాజెక్టుకు బడ్జెట్లో నిధులు కేటాయించి, నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని పలనాడు జిల్లా రైతు సంఘాల మరియు ప్రజా సంఘాల సమన్వయ సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం అఖిలపక్ష రైతు సంఘాల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ అరుణ్ బాబు కి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై రాధాకృష్ణ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో సుమారు రెండున్నర లక్షల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేస్తున్నారని, రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుండి లక్షలాది రూపాయలు అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తే, పంట అమ్మ బోయేసరికి గతం కంటే ధర సగానికి సగం పడిపోవడంతో రైతులు లబో,దిబోమంటునారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా ప్రభుత్వం జోక్యం చేసుకొని క్వింటాకు 25 వేల రూపాయల చొప్పున మిర్చిని కొనుగోలు చేయటం జరిగితేనే భవిష్యత్తులో రైతు వ్యవసాయం చేయడానికి ముందుకు వస్తాడని అన్నారు. లేకుంటే అప్పుల భారంతో రైతులు మరింత సంక్షోభంలో దిగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

అదేవిధంగా పల్నాడు జిల్లా లో 100 గ్రామాలకు తాగునీరు, లక్ష ఎకరాలకు సాగునీరు అందించే వరికపుడి శల ప్రాజెక్టు మూడుసార్లు శంకుస్థాపన జరిగిన, నేటికీ నిధులు కేటాయించక ప్రాజెక్టు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉందని అన్నారు. ఇప్పటికైనా వెనకబడిన ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, ప్రాజెక్టు కు నిధులు కేటాయించి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు రెడ్ భాషా ,రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు రాంబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగానికి ఏమాత్రం ఉపయోగపడే విదంగా లేదనారు.

# ప్రైవేట్ పనుల్లో బెజవాడ పోలీసులు

విజయవాడ : సోషల్ మీడియా, యూ ట్యూబర్లతో దోస్తీ చేస్తున్న బెజవాడ పోలీసులు ప్రజల వ్యక్తిగత గోప్యతతో చెలగాటాలు ఆడుతున్నారు. గత కొన్ని నెలలుగా సాగుతున్న ఈ వ్యవహారంలో కొందరు పోలీసులే వీడియోలు రికార్డు చేసి ప్రైవేట్ వ్యక్తులకు షేర్ చేయడం చర్చనీయాంశంగా మారింది.విజయవాడలో ట్రాఫిక్ చలాన్లు, నిబంధనల ఉల్లంఘన, హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపే వారిని పోలీసులు ప్రశ్నించే వీడియోలు ఇటీవల కాలంలో వైరల్ అవుతున్నాయి. మహిళలు, వృద్ధులు, ఉద్యోగుల వాహనాలను తనిఖీ చేసే సమయంలో నిబంధనల్ని ఉల్లంఘిస్తే వారికి జరిమానా విధిస్తున్నారు. జరిమానాలతో పాటు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారి వీడియోలను పోలీసులే సోషల్ మీడియాలో షేర్ చేయిస్తున్నారు.ట్రాఫిక్ నిబంధనల్ని కఠినంగా అమలు చేసే విషయంలో ఎవరికి అభ్యంతరం లేకున్నా, చలానాలను విధించే సమయంలో పోలీసులు బాడీ కెమెరాలతో రికార్డు చేస్తున్న వీడియోలు, మొబైల్ ఫోన్లలో రికార్డు చేసే వీడియోలను యూ ట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లతో షేర్ చేస్తున్నారు. ఈ తరహా వీడియోలు వైరల్ అవుతున్నాయి.తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిని సైతం మీడియా ముందు ప్రవేశ పెట్టే సమయంలో ముసుగులు వేసి చూపించే పోలీసులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వారి విషయంలో వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాపిక్ కూడళ్ల వద్ద సాధారణంగా విఐపి మూమెంట్ ఉంటే తప్ప పోలీసులు కనిపించరు. రద్దీ సమయాల్లో జనం ఎవరి బాధలు వారు పడాల్సిందే.ట్రాఫిక్ నియంత్రణ సంగతి ఎలా ఉన్నా నిత్యం ఉదయం, సాయంత్రం చలాన్లు రాయడం మాత్రం విధిగా చేపడుతున్నారు. ట్రాఫిక్ జరిమానాలు మార్చి 1 నుంచి గణనీయంగా పెరిగాయి. ఈ క్రమంలో ప్రతి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో పోటాపోటీగా చలాన్లు విధిస్తున్నారు. మద్యం సేవించి పట్టుబడే వారిని న్యాయస్థానంలో హాజరు పరిస్తే రూ.10వేల జరిమానాతో పాటు జైలు శిక్షలు కూడా విధిస్తున్నారు.ట్రాఫిక్ చలాన్లు వసూలు చేసే క్రమంలో పోలీస్ అధికారులు ఉద్దేశ పూర్వకంగా వాటిని సొంత పబ్లిసిటీ కోసం వాడుకుంటున్నారు. కానిస్టేబుళ్లతో వీడియోలు తీయించుకుని సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లకు షేర్ చేస్తున్నారు. ఆ వీడియోల్లో హెల్మెట్ పెట్టుకోని యువతీ యువకుల్ని పోలీసులు మందలించడం, హెచ్చరించడం వంటివి కూడా ఉంటున్నాయి. జరిమానాలు చెల్లించక పోతే వాహనాలను సీజ్ చేస్తున్నారు.పోలీసులు రికార్డు చేసే వీడియోలను న్యాయస్థానాల్లో సాక్ష్యాలుగా మాత్రమే పరిగణించాల్సి ఉండగా పబ్లిసిటీ కోసం సోషల్ మీడియా వేదికలపై షేర్ చేయడం, వారి ముఖాలను అందరూ గుర్తించేలా షేర్ చేస్తున్నారు. పోలీసుల అధికారిక హ్యాండిల్స్‌లో కూడా మహిళలు, మైనర్ల ఫోటోలను ముఖాలను గుర్తించేలా షేర్ చేస్తున్నారు. పోలీసుల తనిఖీల సందర్భంగా యువతులు, విద్యార్థినులు, మహిళల్ని ప్రశ్నిస్తున్న ఫోటోలను బహిరంగ వేదికలపై షేర్ చేస్తున్నారు.విజయవాడ సీపీగా కాంతి రాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీలు ఉన్న సమయంలో సొంత పబ్లిసిటీ కోసం కొన్ని యూ ట్యూబ్ ఛానళ్లను ప్రోత్సహించారు. పర్సనల్ వీడియోలతో పబ్లిసిటీ చేయించడం, యువతలో గుర్తింపు తెచ్చుకోవడం కోసం వీటిని కొందరు అధికారులు ఉపయోగించే వారు. ఈ తరహా వీడియోలకు మిలియన్లలో వ్యూలు, వేలల్లో లైక్‌లు వస్తున్నాయి తద్వారా అయా ఛానళ్లకు భారీగా ఆదాయం కూడా లభిస్తోంది. ఏపీ పోలీస్ శాఖ వీడియోలను బయటి వారికి షేర్ చేయడం వాటితో ప్రైవేట్ వ్యక్తులకు ఆదాయం పొందడంపై అధికారులు కిమ్మనడం లేదు.పోలీస్ అధికారులు విధుల్లో ఉన్న సమయాల్లో క్లోజప్ షాట్స్, డ్రోన్ షాట్స్ తో సినిమాటిక్ ఎఫెక్ట్‌లతో పబ్లిసిటీ చేయించుకునే వారు. ఆ తర్వాత అధికారులు మారినా మిగిలిన వారు కూడా వాటిని అనుసరించడం మొదలు పెట్టారు. సీఐ స్థాయి అధికారుల నుంచి డీసీపీల వరకు ఇదే బాట పట్టారు. ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగమని తెలిసినా తీవ్ర నేరాలకు పాల్పడినట్టు సోషల్ మీడియాలో దోషులుగా చిత్రీకరిస్తున్నారు. ట్రాఫిక్ చలాన్ల విధించే సమయంలో రికార్డు చేస్తున్న వీడియోలను సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై షేర్ చేయడంపై విజయవాడ ట్రాఫిక్ డీసీపీ వివరణ కోరినా స్పందించలేదు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు భారీగా ఆశావహులు

విజయవాడ : ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మొదలైంది. గ్రాడ్యుయేట్లు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడం, ఎమ్మెల్యేల కోటా భర్తీకి నోటిఫికేషన్ వెలువడటంతో అభ్యర్థుల ఎంపిక కసరత్తు మొదలైంది. జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని అంగీకారం కుదిరింది.ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక నేపథ్యంలో సోమవారం అసెంబ్లీలోని సీఎం ఛాంబర్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో నాగబాబు అభ్యర్థిత్వం ఖరారైనట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు సహా పలు అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు, అభ్యర్థుల ఎంపికపై ఇద్దరూ కొద్ది సేపు చర్చించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.ప్రస్తుతం ఎన్ని కలు జరగనున్న ఐదు స్థానాల్లో ఒక దానిని నాగబాబుకు ఇవ్వాలని నిర్ణయించారు. రాజ్యసభ ఎన్నికల సమయంలోనే నాగబాబు పేరు చర్చకు వచ్చింది. అంతకు ముందు టీటీడీ ఛైర్మన్ రేసులో కూడా వినిపించింది. రాజ్యసభ ఎన్నికల సమయంలో నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని ప్రకటించారు. సీఎం చంద్రబాబు అసెంబ్లీలో కూర్చుని ఉండగా.. పవన్ కల్యాణ్ ఆయన వద్దకు వెళ్లారు.అసెంబ్లీలో కొద్ది నిమిషాలు మాట్లాడుకున్న తర్వాత ఇద్దరూ కలిసి సీఎం ఛాంబర్‌కు వెళ్లారు. బడ్జెట్లో వివిధ శాఖలకు కేటాయింపుల పై పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలు ముఖ్యమంత్రితో చెప్పినట్టు తెలుస్తోంది.మే నెల నుంచి ప్రారంభించే తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రహదా రుల పనులు చాలా వరకు చేశామని.. తాగునీటి సరఫరాపై ఎక్కువ దృష్టి పెట్టామని చంద్రబాబుకు పవన్ వివరించారు.ఉపాధి హామీ ద్వారా రాష్ట్రానికి ఎక్కువ నిధులు రాబట్టుకుని పెద్దఎత్తున పనులు చేయాల్సిన అవసరంపై చర్చించారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రికి పవన్ కల్యాణ్ సూచించారు.ప్రస్తుతం మండలిలో జనసేన తరపున పిడుగు హరిప్రసాద్ ఎమ్మెల్సీగా ఉన్నారు. అదే సామాజిక వర్గానికి చెందిన నాగబాబును ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. మంత్రి వర్గంలో ప్రస్తుతం పవన్‌తో పాటు కందుల దుర్గేష్ ఉన్నారు. నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని ఇప్పటికే ప్రకటించడంతో మూడో మంత్రి పదవి కూడా జనసేనలో అదే సామాజిక వర్గానికి దక్కనుంది.టీడీపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఆశిస్తున్న వారి జాబితా భారీగా ఉంది. ఎన్నికల పొత్తులో భాగంగా సీట్లు దక్కని వారంతా ఎమ్మెల్సీ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. వీరిలో మాజీ మంత్రులు కూడా ఉన్నారు. చంద్రబాబును, లోకేష్‌ను ప్రసన్నం చేసుకోడానికి ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, అశోక్ బాబు వంటి నేతలుఎమ్మెల్సీ స్థానం కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.ఎమ్మెల్సీ ఆశిస్తున్న పలువురు నేతలు అసెంబ్లీలో చక్కర్లు కొడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను ప్రసన్నం చేసుకోవాలని తహతహలాడుతున్నారు.

ఖాళీ అవుతున్న ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ సోమవారం మొదలైంది.యనమల రామకృష్ణుడు, బీటీ నాయుడు, ఆశోక్బాబు, దువ్వారపు రామారావు, జంగా కృష్ణమూర్తిల పదవీకాలం ఈ నెల 28తో ముగుస్తోంది. శాసనసభలో కూటమి పార్టీలకే అన్ని స్థానాలను దక్కించుకునే అవకాశం ఉంది. ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో మిగిలిన నాలుగు స్థానాలపై పోటీ తీవ్రంగా ఉంది. బీజేపీ కూడా ఒక స్థానాన్ని కోరే అవకాశం ఉంది.మాజీ మంత్రులు కేఎస్ జవహర్, పీతల సుజాత, కేఈ ప్రభాకర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, విశాఖకు చెందిన మహ్మద్ నజీర్ అసెంబ్లీలో దర్శనం ఇచ్చారు. దువ్వారపు రామారావుకు మళ్లీ అవకాశం కల్పించాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరాలని విశాఖ జిల్లాకు చెందిన ఎమ్మె ల్యేలు రాత్రి సమావేశమై నిర్ణయించారు. శాసనసభ ఎన్నికల్లో పొత్తులతో పోటీ చేసే అవకాశం కోల్పోయిన వారంతా ఎమ్మెల్సీ కోసం పోటీపడుతున్నారు.

# గందరగోళంగా మారిన టౌన్ ప్లానింగ్

నెల్లూరు : ఏపీ మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పేది ఒకటి ఆ శాఖలో జరిగేది మరొకటి? ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణ రంగానికి ఊతం ఇచ్చేలా పలు నిర్ణయాలను .నారాయణ ప్రకటించారు. వంద గజాల్లోపు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మొదలుకుని అపార్ట్‌మెంట్ల నిర్మాణం వరకు భవన నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు పలు నిర్ణయాలను ప్రకటించారు. అయితే మంత్రి నారాయణ చెప్పిన వాటిలో ఇప్పటి వరకు ఒక్క నిర్ణయం కూడా అమలు కాలేదు. తాజాగా గత వారం హైకోర్టు ఆదేశాలతో? పురపాలక శాఖ భవన నిర్మాణ నిబంధనలు మరింత కఠినతరం చేసింది.ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విషయంలో ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల్ని ఉల్లంఘిస్తే మరింత కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పిన దానికి ఆ శాఖలో క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలకు పొంతన కుదరడం లేదు. దీనిపై భవన నిర్మాణ రంగంలో ఉన్న వారి నుంచి బహిరంగంగానే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.తాజాగా భవన నిర్మాణదారుల కోసం అందుబాటులోకి వచ్చిన కొత్త సాఫ్ట్ వేర్ తీసుకొచ్చినట్టు మంత్రి నారాయణ ప్రకటించారు. 18 మీటర్ల ఎత్తు లోపు నిర్మించే భవనాలకు స్వీయ ధ్రువీకరణ పత్రం సరిపోతుందని టౌన్ ప్లానింగ్ అధికారులతో సంబంధం లేకుండా సరైన పత్రాలు సమర్పిస్తే ఆటోమెటిక్ గా అనుమతులు మంజూరవుతాయని ప్రకటించారు. ఈ విధానం 2019 నాటికి విజయవాడలో అమల్లో ఉంది. అయితే ఆటోమెటిక్ అనుమతుల జారీ విధానాన్ని పూణేకు సంబంధించిన కంపెనీకి అప్పట్లో అప్పగించారు. ప్రభుత్వం భవన నిర్మాణదారులకు ఎవరి జోక్యం లేకుండా ఈ అనుమతులు జారీ చేసే ఉద్దేశంతో సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెడితే అందులో కూడా టౌన్ ప్లానింగ్ వేలు పెట్టింది.కార్పొరేషన్ల పరిధిలో అధికారుల్ని ప్రసన్నం చేసుకుంటేనే ఆన్‌లైన్‌లో అనుమతి జారీ అయ్యేలా మార్పులు చేశారు. దీంతో గత ఐదేళ్లలో భవన నిర్మాణదారులు నరకం అనుభవించారు. అన్ని రకాల ఫీజులు చెల్లించినా కొర్రీలు వేసి ముప్పు తిప్పలు పెట్టేవారు. మునిసిపల్ కమిషనర్లను కూడా ఖాతరు చేయకుండా టౌన్ ప్లానింగ్ విభాగం వ్యవహరించేది.

సెల్ఫ్ సర్టిఫికేషన్ సరిపోతుందా??

భవన నిర్మాణాలకు అనుమతుల విషయంలో స్వీయ ధృవీకరణ సరిపోతుందని గత నెలలో జీవో జారీ చేశారు. ఆ తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విషయంలో మరికొన్ని నిబంధనలు విధించారు.తాజాగా రిజిస్టర్డ్ ఇంజినీర్లు,ఆర్కిటెక్ట్ లు యజమానుల సమక్షంలో ఆన్ లైన్ లో సెల్ఫ్ సర్టిఫికేషన్ ఇస్తే సరిపోతుందని ప్రకటించారు. భవన నిర్మాణ అనుమతులను త్వరితగతిన జారీ చేసేలా ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చిందని మంత్రి నారాయణ చెబుతున్నారు. ఌఖఆఖఓ పోర్టల్ లో సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానం అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. అయితే భవన నిర్మాణాలను కొనసాగించడానికి కార్పొరేషన్ల పరిధిలో మార్టగేజ్ చేయాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే తనఖా పెట్టిన భాగాలను జప్తు చేయడంతో పాటు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విడుదల కాదు.ఏపీలో 2019 నాటికి 250కు మించిన స్థలంలో 18మీటర్ల ఎత్తు వరకు భవనాలను నిర్మించుకనే వెసులుబాటు ఉంది. ఆ తర్వాత నిర్ణత బాండ్లను చెల్లించి ఆరో అంతస్తు నిర్మాణం చేపట్టేందుకు కూడా వైసీపీ ప్రభుత్వంలో అనుమతులిచ్చారు. దీంతో 250-30గజాల్లోపు స్థలాల్లో ఆరంతస్తుల వరకు నిర్మాణాలను చేపట్టే అవకాశం లభించింది.ఇకపై 18 మీటర్ల లోపు లేదా ఐదంతస్తుల లోపు భవనాల నిర్మాణాల అనుమతులకు స్వీయ ధృవీకరణ పత్రం ఇస్తే సరిపోతుందని ...టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి అవసరం లేకుండానే భవన నిర్మాణాలకు పర్మిషన్ వచ్చేస్తుందని ప్రభుత్వం చెబుతోంది.భవన యజమానులు రిజిస్టర్డ్ ఎల్ టీపీలు,ఇంజినీర్లు లేదా ఆర్కిటెక్ట్ ల సమక్షంలో సరైన పత్రాలు సమర్పించి స్వీయ ధృవీకరణ(అఫిడవిట్)ఇవ్వాల్సి ఉంటుందని మెలిక పెట్టారు. గత నెలలోనే భవన నిర్మాణ అనుమతులకు కొత్త విధానం అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది.భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియను త్వరితగతిన జారీ చేసేలా ఈ కొత్త విధానాన్ని సర్కార్ అందుబాటులోకి తీసుకొచ్చిందని మంత్రి నారాయణ చెబుతున్నారు. సెల్ఫ్ సర్టిఫికేషన్ ద్వారా నిర్మాణాలకు అనుమతులిచ్చేందుకు అవసరమైన సాఫ్ట్ వేర్ ను ఌఖఆఖఓ పోర్టల్ లోకి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ విధానం ఆమోదం పొందిన లేఅవుట్లు, గ్రామ కంఠం,సర్కులేషన్ ప్లాన్లు ఉన్న ప్రాంతాలు,1985 కు ముందు నిర్మించిన భవనాల పునర్మిణానానికి ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు.

టౌన్ ప్లానింగ్‌పై తీవ్ర విమరశలు..

ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రణాళిక విభాగం పనితీరుపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా విజయవాడ, విశాఖపట్నం వంటి మునిసిపల్ కార్పొరేషన్లలో భవన నిర్మాణాలకు అనుమతులు, ప్లాన్ మంజూరు అంటే ముడుపులతో కూడుకున్న వ్యవహారంగా మారిపోయింది. ఏ ఫీజు ఎంత వసూలు చేస్తారనే వివరాలు ఎవరికి దొరకవు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది చెప్పినంత చెల్లించాల్సిందే. నిర్ణీత ఫీజులు చెల్లించినా టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ప్రసన్నం చేసుకోకపోతే వారిని ముప్పు తిప్పలు పెడతారు. ప్లాన్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే దగ్గర నుంచి దానికి ఫీజులు జనరేట్ అయ్యే వరకు రకరకాల కొర్రీలు వేసి వేధింపులకు గురి చేస్తుంటారు.ఇక ఖాళీ స్థలాలు కట్టే నిర్మాణాలకు ఆ స్థలం కొన్నప్పటి నుంచి వేకెంట్ ల్యాండ్ టాక్స్ వసూలు చేస్తారు. మధ్యలో ఎందరి చేతులు మారినా అది రికార్డుల్లో ఎక్కినప్పటి నుంచి నిర్మాణదారులు పన్ను చెల్లించాల్సి వస్తోంది. భవన నిర్మాణాలు పూర్తై అవి అమ్ముడుపోయే వరకు ఖాళీగా ఉన్న కాలానికి కూడా ఏపీలో పన్నులు వసూలు చేస్తున్నారు.పాత ఇళ్లను కూల్చి నిర్మాణాలు చేపడితే నిర్మాణం జరిగే సమయానికి కూడా వేలకు వేలు పన్నులు వసూలు చేస్తున్నారు.

పాత ఇళ్లకు ఇంటి పన్నులు, డ్రైనేజీ, వాటర్ టాక్స్‌లు చెల్లిస్తూ, కొత్త నిర్మాణాలను చేపడితే ఆ కాలానికి కూడా పన్నులు వసూలు చేస్తున్నారు.అదే సమయంలో కొత్త నిర్మాణాలకు నిబంధనల మేరకు ఫీజులు జనరేట్ చేస్తూ అవే కనెక్షన్లను కొత్తగా ఇస్తున్నట్టు అదనపు వసూళ్లు చేస్తున్నారు. ఒక పాత భవనాన్ని కూల్చి కొత్త నిర్మాణం చేపడితే పాత భవనానికి, కొత్త నిర్మాణానికి కలిపి రెండు వేర్వేరు పన్నుల్ని ఏపీలో మునిసిపల్ కార్పొరేషన్లు వసూలు చేస్తున్నాయి. నిర్మాణదారుల సమస్యల్ని పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు.

# ఎకరం 50 కోట్లు.. అమ్మకానికి 500 ఎకరాలు

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. హైదరాబాద్ గచ్చిబౌలిలో 400 ఎకరాల సర్కార్ భూమిని వేలం వేయాలని భావిస్తోంది. శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలి గ్రామం పరిధిలో ఈ భూమి ఉండగా.. టీజీఐఐసీకి ద్వారా విక్రయించేందుకు ప్రయత్నిస్తుంది. సంక్షేమ పథకాల అమలు, ఇతర ఇవసరాల కోసం డబ్బు సమీకరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అంతర్జాతీయ స్థాయి లేఔట్‌ను అభివృద్ధి చేసి.. వేలం ద్వారా భూములను విక్రయించేందుకు కన్సల్టెంట్ నియామకానికి టెండర్లు పిలిచింది. ఈ నెల 15 వరకు బిడ్ల దాఖలుకు గడువిచ్చారు. డిసెంబర్ 2023లో కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మొదటి భూ వేలం ఇదే కానుంది. ఈ వేలం ద్వారా ప్రభుత్వం రూ. 20,000 కోట్లకు పైగా సేకరించాలని భావిస్తోంది. కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నంబర్ 25(ఖ) వద్ద ఉన్న 400 ఎకరాల స్థలంలో 'మాస్టర్ ప్లాన్ లేఅవుట్'ను అభివృద్ధి చేయాలని ఎఉఏఎఅ యోచిస్తోంది. ఈ భూమిని అభివృద్ధి చేసి దశలవారీగా విక్రయించనున్నారు. అత్యంత ఖరీదైన వెస్ట్ జోన్ పరిధిలో, ఐటీ కంపెనీలకు అతి సమీపంలోని ఈ భూమి ఉంది. హైటెక్ సిటీ నుంచి 7-8 కి.మీ, పంజాగుట్ట క్రాస్‌రోడ్స్ నుండి 15-18 కి.మీ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి 22 కి.మీ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి దాదాపు 33 కి.మీ దూరంలో ఈ స్థలం ఉంది. అక్కడి లేఔట్లలో గజానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు పలికే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తుంది. ఎకరాల్లో అయితే ఎకరం రూ. 50 కోట్లు పలుకుతుందని అంచనా.లేఔట్ మాస్టర్ ప్లాన్ తయారీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వేలం ద్వారా ప్లాట్ల విక్రయాలు తదితర కార్యక్రమాల నిర్వహణ కోసం తాజాగా.. రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్‌ని ఆహ్వానించారు. క్వాలిటీ కమ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్ (క్యూసీబీఎస్)పద్ధతిలో బిడ్డర్‌నుఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, భూమలు వేలం ద్వారా వచ్చే రూ.20 వేల కోట్లను రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సహా ఇతర పథకాల కోసం వెచ్చించనున్నట్లు తెలిసింది.

# అరకు నుంచి అమెరికాకు కాఫీ

విశాఖపట్టణం : అరకు కాఫీకి ఆర్గానిక్ సర్టిఫికేషన్ లభించింది. ఇది ఆదివాసీ రైతులకు ఎంతో మేలు చేయనుంది. ఆర్గానిక్ సర్టిఫికేషన్ ద్వారా అరకు కాఫీని యూరప్‌కు ఎగుమతి చేసే అవకాశం వచ్చింది. దీని ద్వారా దాదాపు 2600 మంది రైతులకు లబ్ధి జరగనుంది. అసలు అరకు కాఫీకి ఎందుకంత డిమాండ్.. ఆర్గానికి సర్టిఫికేషన్ అంటే ఏంటీ.. దాని వల్ల కలిగే లాభాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. అరకు కాఫీని గిరిజన రైతులు సేంద్రియ ఎరువులు ఉపయోగించి పండిస్తారు. రసాయన మందులు వాడకుండా సహజ పద్ధతుల్లో పండించడం వల్ల ఇది మరింత రుచికరంగా, ఆరోగ్యకరంగా ఉంటుంది. సముద్ర మట్టానికి 3600 అడుగుల ఎత్తులో సిల్వర్ ఓక్, మిరియాల చెట్ల మధ్య ఈ కాఫీ తోటలు పెరుగుతాయి. ఈ ప్రత్యేకమైన వాతావరణం వల్ల కాఫీ గింజలకు ఒక ప్రత్యేకమైన రుచి, సువాసన వస్తాయి. అరకులో అరబికా రకం కాఫీని పండిస్తారు. ఈ రకం కాఫీకి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉందిఅరకు కాఫీకి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉంది. దీని రుచి, నాణ్యతకు గాను అనేక అవార్డులు కూడా లభించాయి. అరకు కాఫీ సాగులో గిరిజన రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి శ్రమ, నైపుణ్యం వల్లనే ఈ కాఫీ అంత రుచికరంగా ఉంటుంది. అరకు లోయలో మహిళలు పండిస్తున్న కాఫీలో చక్కటి పరిమళం ఉందని గతంలో ఐరాస ప్రతినిధులు ప్రశంసలు కురిపించారు. కాఫీ సాగు ద్వారా ఆర్థిక సామాజిక విప్లవాన్ని తీసుకురావడంలో అరకు మహిళల కీలక పాత్ర ఉందని, అరకు మహిళలు భారత నారీశక్తికి చిహ్నాలని ఐకాస ప్రతినిధులు కొనియాడారు. అరకు కాఫీ ప్రత్యేకమైన సుగంధ లక్షణాలు కలిగి రుచికి ప్రసిద్ధి చెందింది.ఆర్గానిక్ సర్టిఫికేషన్ వల్ల అరకు కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గుర్తింపు లభిస్తుంది. ఆర్గానిక్ సర్టిఫికేషన్ వల్ల యూరప్, అమెరికా వంటి దేశాలకు అరకు కాఫీని ఎగుమతి చేసే అవకాశం పెరుగుతుంది. ఆర్గానిక్ కాఫీకి సాధారణ కాఫీ కంటే ఎక్కువ ధర లభిస్తుంది. ఇది గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. ఆర్గానిక్ కాఫీలో రసాయన ఎరువులు, పురుగు మందులు ఉండవు. కాబట్టి ఇది ఆరోగ్యానికి మంచిది. ఆర్గానిక్ వ్యవసాయం పర్యావరణానికి హాని కలిగించదు. ఇది నేల, నీరు, గాలి కాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఆర్గానిక్ కాఫీ సాగు గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది.అరకు కాఫీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. కాఫీ తాగడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది. ఇది జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఈ కాఫీ తాగడం వల్ల టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. కాఫీ తాగడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. కాఫీలో కెఫీన్ ఉంటుంది. ఇది శక్తిని పెంచుతుంది, అలసటను తగ్గిస్తుంది. అరకు కాఫీ ఆర్గానిక్ గుర్తింపు పొందడం వల్ల గిరిజన రైతులకు, పర్యావరణానికి, వినియోగదారులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

# మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలి



- మహిళలు లేనిదే దేశం మనుగడ లేదు
- బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్ట మల్లేష్ గౌడ్

**వేద న్యూస్, వేములపల్లి :**

మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టం మల్లేష్ గౌడ్ అభిప్రాయపడ్డారు. మహిళలు లేనిదే దేశం మనగాడ లేదన్నారు. శుక్రవారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో మహిళా దినోత్సవ సందర్భంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలను శాలువులతో సన్మానించి బహుమతులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజికంగా అన్ని రంగాలలో ముందుకు రాణిస్తూ ఉండడం గర్వించదగ్గ విషయం అన్నారు.మహిళలను చిన్నచూపు చూడవద్దని, మహిళలను గౌరవించిన చోట శుభాలు వర్ధిల్లుతాయన్నారు. ఆడపిల్లలను అన్ని రంగాల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. వంటింటి నుండి మొదలు పెడితే అంతరిక్షం వరకు మహిళా శక్తి పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మజ్జిగపు పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, పంచాయతీ కార్యదర్శి నవీన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మజ్జిగపు సుధాకర్ రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ శేఖర్ ,మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ గోపాల్ రావు, గౌరు శ్రీనివాస్, సైదులు, నాగలక్ష్మి, మట్టమ్మ, సంధ్య, సోమమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

- సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు పొందాలి
- మండల విద్యాధికారి బాలూ నాయక్

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

దేశ భవిష్యత్తు తరగతి గదినుండే మొదలవుతుందని, దానికోసం విద్యార్థులు కష్టపడి చదివి సమాజాభివృద్ధికి తోడ్పాడాలని మండల విద్యాధికారి బాలు నాయక్ అన్నారు.

ప్రాథమిక పాఠశాల యన్ యస్ పి క్యాంప్ నందు జరిగిన స్వపరిపాలన దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజా ప్రతినిధులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా విద్యార్దులు ఆయా పాత్రలు చక్కగా నిర్వహించారని వారిని అభినందించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాష్యా నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు ఈరోజు ఏ బాధ్యతలు అయితే నిర్వహించారో ఆ బాధ్యతలు భవిష్యత్తులో కూడా నిర్వహించే విధంగా కృషి చేయాలని, కష్టపడినప్పుడు ఫలితం ఖచ్చితంగా వస్తుందని ఫలితాలను అనుభవించడం కోసం ప్రయత్నం చేస్తూ భవిష్యత్తులో ఉన్నత పౌరులుగా ఎదగాలని అన్నారు.

స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయులుగా సబీనా , డీఈఓ గా సల్మా, ఆర్జేడీగా శ్రీమాన్, యంఈఓ గా రియాన్, ఏయంసి ఛైర్మన్‌గా భవిజ్ఞ మరియు ఉపాధ్యాయులు గా పలువురు విద్యార్థులు వివిధ హోదాలను ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు.అనంతరం మహిళా టీచర్స్, సిబ్బందిలను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి నారాయణ, వడ్డగాని జానయ్య, గుత్తికొండ సుదర్శన్ రెడ్డి, ఆదిలక్ష్మి, ఉషా రాణి, ఇందిరా, వెంకట లక్ష్మి , యుగెందర్, ఉమా మహేశ్వరీ ఆఫీస్ సబార్డినేట్ భూలక్ష్మి, మదారమ్మ, వాసు తదితరులు పాల్గొన్నారు.



## స్వీపర్‌కి తప్పిన పెను ప్రమాదం

**వేద న్యూస్, ఎంజీఎం :**

సిలిండర్ పేలి స్వీపర్ కు గాయాలైన ఘటన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చోటుచేసుకుంది. శుక్రవారం ఎంజీఎం ఆర్తో వార్డులో ఓ పేషంట్ ఆక్సిజన్ సిలిండర్ అవసరం ఉండి స్లీపర్ వెళ్ళగా, సిలిండర్ పై ఉన్న చిప్పు ఒకసారిగా ఊడిపోవడంతో పై చువ్వ ఒక్కసారిగా స్వీపర్ కి తగిలింది. దీంతో స్వీపర్ జ్యోతి కి స్వల్ప గాయాలు అయ్యాయి. ఎంజీఎం క్యాజువాలిటీలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. అయితే సిలిండర్ తీసుకొచ్చే బాధ్యత వార్డ్ బాయ్ కి ఉంటుంది. కానీ ఆక్సిజన్ వార్డులో ఎవరు సరిగా పని చేయకపోవడం వల్లనే స్వీపర్ కి గాయాలైనట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా ఎవరి పని వారు చేస్తేనే ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని అధికారులు సోమరిపోతులైన వార్డు బాయ్ లపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

## నేటి పిల్లలే..దేశ సంరక్షకులు

**వేద న్యూస్, వేములపల్లి :**



వేములపల్లి మండల కేంద్రంలోని రావులపెంట గ్రామంలో శుక్రవారం ఉదయం అంగన్వాడి -3 సెంటర్లో స్వపరిపాలన దినోత్సవము ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ శీలం శారద మాట్లాడుతూ నేటి పిల్లలే నవ సమాజ నిర్మాతలు అవుతారన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయుటకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఆయా అనిత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న భవిత శ్రీ

**వేద న్యూస్, ఖిలావరంగల్ :**

వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటకు చెందిన అరవింద పబ్లిక్ స్కూల్ విద్యార్థిని రాగి భవిత శ్రీ (5వ తరగతి) పేయింటింగ్ (సిపిఓ) విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకుంది. ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టాపర్ అవార్డుల ప్రధానోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రా డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, సినీ నటులు అశోక్ కుమార్, జెన్ని, ఘర్షణ శ్రీనివాస్, ప్రముఖ సైకాలజిస్ట్ బీవీ సత్య నగేష్, ఐబిఓ డైరెక్టర్ అంతోటి రామకృష్ణ ల చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమొంటోను అందజేశారు. గత నెల 9న ఖమ్మం పట్టణంలో జరిగిన స్టేట్ సెకండ్ లెవెల్ ఎగ్జామ్ కు పాఠశాల నుండి 8 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరు కాగా ఆర్ భవిత శ్రీ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైంది. గత సంవత్సరము కూడా అరవింద పబ్లిక్ స్కూల్ విద్యార్థిని సుతారి సంకీర్తన (6వ తరగతి) గణిత శాస్త్రంలో రాష్ట్రస్థాయి అవార్డును అందుకుంది. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ తెలంగాణ ఇన్చార్జ్ కావ్య, ఆంధ్ర ప్రదేశ్ ఇంచార్జ్ అజిత్ బేగ్, గాయకులు మొగిలి వెంకటేశ్వర్లు, నాగసాయి, తల్లిదండ్రులు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులందరూ ఉన్నత స్థితికి ఎదగాలి

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

మాడుగుల పల్లి మండలంలోని చర్ల గూడెం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, శుక్రవారం ఘనంగా స్వపరి పాలన దినోత్సవంను నిర్వహించిన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దిరాల నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు, జిల్లా విద్యాధికారిగా చందు, మండల విద్యాధికారినిగా లక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలుగా సాత్విక, ఉపాధ్యాయులుగా సంజయ్, యజ్ఞత్ కుమార్, నందిక, చన్మిష, వర్షిణి,తమ నైపుణ్యాలను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, మమత పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థిని, విద్యార్థులకు షిల్డ్ లతో పాటు బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులందరు భవిష్యత్తులో ఇష్టం తో, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అందుకోని కన్న తల్లి దండ్రులకు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకు వచ్చే విదంగా గొప్ప ప్రయోజకులు, ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు.



# విద్యుత్ సిజిఆర్‌ఎఫ్ మీటింగ్‌కు మంచి స్పందన

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ ఏఈ (అసిస్టెంట్ ఇంజనీర్) కార్యాలయం ఆవరణలో కమలాపూర్, ఉప్పల్, ఎల్కతుర్తి మూడు సెక్షన్ల పరిధిలో గల గ్రామాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కొరకు ఏర్పాటు చేసినటువంటి విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్ట్ (సిజిఆర్ఎఫ్ కన్స్యూమర్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ ఫోరం) కి మంచి స్పందన లభించింది. ఈ మీటింగ్ కార్యక్రమానికి టీజీ ఎన్పీడీసీఎల్ (తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్) విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్పర్సన్ వి వేణుగోపాల చారి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ లోకల్ కోర్టులో విద్యుత్ వినియోగదారులకు సంబంధించిన విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్ల మార్చడం, లోపాలు ఉన్నటువంటి మీటర్లను మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, అదనపులోడు క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు మార్పు, వాడకానికన్నా మొత్తంలో గల బిల్లులు కేటగిరి మార్పు, సర్వీసు రద్దు మొదలగు సమస్యల పరిష్కారం కొరకు విద్యుత్ వినియోగదారులు రాతపూర్వకంగా అయినా, ఈమెయిల్, వాట్సాప్ ద్వారా అయినా సమస్యలపై సమాచారం అందించవచ్చని, 1912



నెంబర్ కి అయిన కాల్ చేసి తమ సమస్యలను తెలియపరచవచ్చని ఈ నెంబర్ సెక్షన్ ఆఫీసులో 24 గంటలు అందుబాటులో ఉంటుందని సమస్యలపై ఏ సమయంలోనైనా వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు అందిన వెంటనే సమస్య పరిష్కారానికి సంబంధిత సెక్షన్ అధికారులు కృషి చేస్తారని, ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి అనే కార్యక్రమం ఉంటుందని అందులో అయినా సమస్యలపై ఫిర్యాదు చేసి తక్షణ పరిష్కారం పొందవచ్చని సూచించారు. లోకల్ కోర్టులో ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు వినియోగదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత సెక్షన్ అధికారులకు పలు సూచనలు చేశారు. టీజీ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ తో పాటు కే రమేష్ (మెంబర్ టెక్నికల్), చరణ్ దాస్ (మెంబర్ ఫైనాన్స్), ఎం రామారావు (ఇండిపెండెంట్ మెంబర్) కోరారు. అనంతరం డిఈ (డివిజనల్ ఇంజనీర్) సౌమ్య నాయక్ విద్యుత్ వినియోగదారులకు సంబంధించిన సమస్యలపై సంబంధిత సెక్షన్ అధికారులు తక్షణమే స్పందించాలని స్పందించి ఆ సమస్యల పరిష్కారం దిశగా చొరవ చూపాలని కమలాపూర్ ఏఈ రాములు, ఉప్పల్ ఏఈ సంపత్ రెడ్డి, ఎల్కతుర్తి ఏఈ సుధాకర్ లకు తగిన సూచనలు చేశారు. కమలాపూర్, ఉప్పల్, ఎల్కతుర్తి మూడు సెక్షన్లను తగిన రీతిలో అనుసంధానం చేసుకుంటూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఏడిఈ (అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్) వంశీ కి సూచించారు. అనంతరం ఏడీఈ మాట్లాడుతూ సమస్య పై ఎక్కడికెళ్లి ఫిర్యాదు చేసిన ఆ సమస్య పరిష్కారానికి సంబంధిత సెక్షన్ అధికారులదే బాధ్యత ఉంటుందని కాబట్టి సెక్షన్ పరిధిలో ఉన్నటువంటి విద్యుత్ వినియోగదారుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చూపి వారికి మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని ఏఈలకు, సిబ్బందికి ఈ సందర్భంగా సూచించారు.

# గ్రామీణ ప్రజలు.. సాంస్కృతిక రాయబారులు

**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ నేల సాంస్కృతిక సింగిడి అని, సామాన్యుల జీవితాలలోని విభిన్న కోణాలను తన కెమెరా కన్నుతో బంధించే కందుకూరి రమేశ్ వైవిధ్యమైన ఫోటోగ్రాఫర్ అని అభినందించారు. సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిటీ కాలేజీలో లి సెలబ్రేటింగ్ ఉమెన్ హుడ్ పేరిట ఏర్పాటు చేసిన రమేశ్ బాబు ఛాయా చిత్ర ప్రదర్శన డా.శుక్లా ప్రారంభించారు. గత రెండు దశాబ్దాలుగా జర్నలిస్టుగా, రైటర్ గా, ఫోటోగ్రాఫర్ గా బహుముఖీనంగా కృషి చేస్తున్న రమేశ్ సామాన్యశాస్త్రం పేరుతో తీస్తున్న చిత్రాలతో సామాన్యులను సెలబ్రిటీలుగా నిలబెట్టాయన్నారు. స్త్రీల జీవితంలో బాల్యం నుండి వృద్ధాప్యం వరకు వివిధ దశలలోని సహజత్వాన్ని ఛాయా చిత్రాలుగా మలిచాడన్నారు. పేద ప్రజలే సాంస్కృతిక సంపన్నులని



కందుకూరి రమేశ్ బాబు ఫోటోలు చాటి చెబుతున్నాయని అన్నారు. ఐక్యూయేసి కన్వీనర్ డా.నీరజ మాట్లాడుతూ శ్రామిక మహిళల ఆత్మగౌరవం, ప్రతిఘటనాత్మక దృష్టి రమేశ్ బాబు చిత్రాల్లో దర్శనమి స్తుందని, ఈ తరం విద్యార్థులు కేవలం తరగతి పుస్తకాలకే పరిమితం కాకుండా మంచి అభిరుచులను అలవాటు చేసు కుని తమకు నచ్చిన కళలను అభ్యసించాలని అన్నారు. తెలుగు శాఖ అధ్యక్షులు డా.కోయి కోటీశ్వర రావు మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ మహిళల వస్త్రధారణ, సహజ సిద్ధమైన అలంకరణ, ఆభరణ విశేషాలు తదితర అంశాలను రమేశ్ బాబు అత్యంత సూక్ష్మంగా తన ఛాయా చిత్రాల్లో పొందుపరిచాడని అన్నారు. ఆంగ్ల ఆచార్యులు డా.శ్రీకాంత్ మాట్లాడుతూ రమేశ్ బాబు చిత్రాలు అనేక కథలు చెప్తాయని, కవిత్వానికి ఛాయా చిత్ర రూపమే అతని ఫొటోగ్రఫీ అన్నారు. తెలంగాణ గ్రామీణ ప్రజలు సాంస్కృతిక రాయబారులనీ, సామాన్యుల బతుకుల్లోని అసామాన్య కళాతత్త్వాన్ని విశ్వానికి తెలియ జేయాలనే సంకల్పంతోనే పాత్రికేయుడిగా రచయితగా ఉన్న తాను ఫోటో గ్రాఫర్ గా మారినట్లు కందుకూరి రమేశ్ బాబు తెలియ జేశారు.



## రవీంద్ర భారతి పాఠశాలలో ఘనంగా సెల్ఫ్ గవర్నమెంట్

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణంలోని చిల్లాపురం రవీంద్ర భారతి హై స్కూల్‌లో సెల్ఫ్ గవర్నమెంట్ డే ను శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది.విద్యార్థులు ఉపాధ్యాయులు తమ యొక్క పాత్రలను నిర్వహించారు. అదేవిధంగా కొంతమంది విద్యార్థులు జిల్లా అధికారులుగా, రాజకీయ నాయకులుగా, పి.ఈ. టి,గన్మెన్‌లుగా చక్కగా వారి పాత్రలను వేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కందుల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ నిత్య జీవితంలో ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తున్నారు వారి విషయాలను ఏ విధంగా అర్థం చేసుకుంటున్నాము అనే విధంగా ఈరోజు విద్యార్థులే ఉపాధ్యాయులుగా చక్కగా తమ యొక్క పాత్రలను నిర్వర్తించారని కొనియాడారు. విద్యార్థులు ఎంఈఓగా బాణాల సంజన ఎమ్మెల్యేగా కార్తీక్ జెడ్పి డిఇఓగా సంతోష్,డీఈవోగా ముని,కలెక్టర్గా పవన్ కళ్యాణ్ మరియు ఎడ్యుకేషన్ మినిస్టర్‌గా ప్రవళిక, ముఖ్యమంత్రి గా శంకర్ చాలా చక్కగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కందుల రమాదేవి మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జూట్ ఉత్పత్తులపై అవగాహన అవసరం

**మొదటి పేజీ తరువాయి**

రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చని ఈ దిశగా జూట్ ఉత్పత్తుల తయారిదారులు దృష్టి సారించి ఉత్పత్తులను పెంచాలని అన్నారు. జూట్ ఉత్పత్తులకు జూట్ బోర్డ్ లేబుల్ ఉంటే మార్కెట్లో డిమాండ్ తో పాటు మంచి ధర పొందవచ్చని అన్నారు. ఇందుకుగాను జాతీయ జనపనార బోర్డు వారు అందించే అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జనపనార వినియోగం ఇపుడిపుడే పెరుగుతుందని వీటి ఆవశ్యకత పై ప్రజల్లో మరింతగా అవగాహన రావాల్సిన అవసరం ఉందని ప్రజల అవసరాలతో పాటు ప్రస్తుత మార్కెటింగ్ కు అనుగుణంగా జనపనార ఉత్పత్తులు రావాలని ఈ దిశగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ఉండాలని జనపనార ఉత్పత్తుల తయారీదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్యావరణానికి ప్రమాదకరం గా పరిణమించే ప్లాస్టిక్ స్థానంలో జూట్ ఉత్పత్తుల వినియోగం పెరిగేలా జూట్ తయారీదారుల సంఖ్య పెరగాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ సంధ్యారాణి, భారత ప్రభుత్వ టెక్స్ టైల్ మంత్రిత్వశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నిశాంత్ జె. మెట్రాస్ అసిస్టెంట్ డైరెక్టర్ దివ్యారావు, టెక్స్ టైల్ కమిటి క్వాలిటి అశ్యురెన్స్ అధికారి సి. సతీష్ కుమార్, టెక్స్టైల్స్ కమిటీ ఇన్‌చార్జ్ శిరీష , డిఆర్డిఓ కౌసల్యదేవి, జీ డబ్ల్యూఎం సి మెప్మా అధికారులు ఎస్ హెచ్ జీ బృందాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

## విధులు కాని విధులు.. వేతన వెతలు!

**మొదటి పేజీ తరువాయి**

సందర్భాలు నెలకొన్నాయి. తమకు ఆర్థిక పరిస్థితి అనుకూలించనప్పటికీ.. సర్వే పనుల నిమిత్తం ప్రైవేటు వాహనాల ద్వారా ఫీల్డ్ విజిట్‌కు వెళ్తూ.. ఉన్నతాధికారులు నిర్దేశించిన టార్గెట్ పూర్తి చేయడానికి గ్రూప్-4 ఎంప్లాయిస్ అవస్థలు పడుతున్నారు. ప్రస్తుత మార్చి నెలలో సూర్యుడు సుర్రుమంటూ.. నడీ నెత్తి మీద తన ప్రతాపాన్ని చూపుతున్నా.. టార్గెట్ పూర్తి చేయడానికి తాము దృష్టి పెట్టాల్సి వస్తోందని, తమ అవస్థలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అరిగోసలు పడుతూ.. లోలోపల మధనపడుతున్నట్టు వినికిడి. వేసవికాల తీవ్రవేడిని తట్టుకోలేక ఉద్యోగ బాధ్యతల్లో డీలా పడిపోతున్నట్టుగా సమాచారం. ఉన్నతాధికారులు గ్రూప్-4 ఉద్యోగుల విషయమై దృష్టి సారించాలని, వారిని సరైన రీతిలో ఉపయోగించుకుని వారి ద్వారా ప్రజలకు మేలు జరిగేలా జాబ్ చార్ట్ విషయమై దిశానిర్దేశం చేయాలని ఈ సందర్భంగా పలువురు కోరుతున్నారు.

## 'మగువకేది విలువ'

మగువా మగువా లోకానికి తెలుసా నీ విలువా..మగువా మగువా నీ సహనానికి సరిహద్దులు కలవా"

అవును తరతరాలుగా పితృస్వామ్య వ్యవస్థలో కొట్టుమిట్టడుతూ తనకంటూ ఓ గుర్తింపును తెచ్చుకోవాలని చేస్తున్న యుద్ధంలో నిజంగా మహిళలను ఈ వ్యవస్థ గౌరవిస్తుందా..? నిజంగా వాళ్ళకి అండగా నిలుస్తుందా వాళ్ళు చేస్తున్న త్యాగాలకు విలువనిస్తుందా అన్న ప్రశ్నలకూ సరైన జవాబు రాకపోవచ్చేమో అనేది నా భావన.. అత్యంత ఆధునిక ప్రపంచంలో బ్రతుకుతున్న మనం అనాగరిక కాలం నుండి నాగరికత సృష్టించుకొని ఆడ మగ అనే బేధభిప్రాయాలూ లేకుండా అందరూ సమానమే అన్న నినాదాన్ని ఎంతవరకు పాటించగలుగుతున్నాము అనే సందేహం గనుక మొదలైతే మౌనం తప్ప దానికి జవాబు దొరకదు. స్త్రీ లేనిదే జననం లేదు, తను లేనిదే మనుగడ లేదు అన్న ప్రపంచం ఇప్పుడు స్త్రీ అన్నిరంగాలలో ఎదుగుతున్నా ఇంకా వారి పట్ల ఒకరకమైన తక్కువ భావం ఎందుకు కొనసాగుతుందని . సృష్టికి ఆడ మగ ఇద్దరు సమానమే, ఒకరు లేనిదే ఇంకొకరికి జీవం లేదు అన్న నిజాన్ని జీర్ణించుకున్న వ్యవస్థ మరి మహిళల విషయంలో జరుగుతున్న అన్యాయలను ఎందుకు అరికట్టడంలేదు, ఎందుకు గొంతెత్తి ప్రశ్నించడంలేదు..? ఎన్నో ఏళ్లుగా వారిపై అణచివేత ఉన్నా ఏ ఒక్కరు కూడా వాళ్ళకి ఆసరాగా నిలబడే ప్రయత్నాలు చేయలేదు. ఎన్ని చట్టాలు పుట్టుకోచ్చినా ఎన్ని ప్రభుత్వాలు మారినా వాళ్ళ తలరాతను మార్చే దిశగా ముందగు వేయడం లేదంటే అభివృద్ధి పేరుతో ఇక్కడ ఎవరికి లాభం చేకూరుతోంది. ఎంతమంది భాధిత మహిళలు తమ గోడును ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా నిజంగా న్యాయం జరుగుతుందా లేక నిమ్మకు నేరేతినట్టు వ్యవహారిస్తోందా అర్థం కావడం లేదు. మహిళలు స్వయంకృషితో ఎదుగుతున్నప్పటికి వారికి ఎక్కడో ఓ చోట ఎదో రూపంలో వివక్ష ఎదురై వారికి శాపంగా మారుతోంది. ఇంటి నుండి మొదలైన వారి చైతన్యం అంతరిక్షంలోకి వెళ్ళి పరిశోదనలు చేసే స్థాయికి ఎదిగినా స్త్రీకి దక్కల్సిన గౌరవం విలువ దక్కలేదనే చెప్పాలి.కంప్యూటర్ యుగంలో ఉన్న మనం ఇంకా సమానత్వం చూపించే విషయంలో విఫలమౌతున్నాం. వారి పట్ల న్యాయంగా నడచుకోలేక పోతున్నాం. నిజంగా వ్యవస్థ పట్ల ఏమాత్రం ఒకింత గౌరవం ఉన్నా మన తోటి అన్ని రంగాలలో సమానంగా పనిచేస్తున్న మహిళలకు తగిన విలువను ఇచ్చి వారి అభివృద్ధికి తోడు నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

కేవలం మహిళల దినోత్సవం రోజూ మాత్రమే వారిని సన్మానించి మరుసటి రోజు నుండి యాదావిధిగా ఉండే మనం వారిపై జరుగుతున్న అనేక రకమైన అమానుష



చర్యలను ఖండిద్దాం వారికి నిజమైన గౌరవాన్ని ఇచ్చి వారి అభ్యున్నతికి తోడుగా నిలబడి సమానత్వంతో వర్ధిల్లాలి అని నా ఆకాంక్ష..

**- మియాపురం శ్రీకాంత్ చారి**
**సెల్ నంబర్ 9059027650**

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073